# 14. నర్సమ్మ నవ్వింది!

ఆ కాన్వెంటులో గుమస్తాగా పనిచేస్తున్న మా దూరపు బంధువు రాంబాబు చెప్పేడు, ఏడాదై పని చేస్తున్నా హెడ్‌మిస్ట్రెస్ నర్సమ్మ మొహాన నవ్వు అనేది తానెప్పుడూ చూడలేదని! ఆవిడ తను నవ్వదు, తన చుట్టు పట్ల వాళ్లనెవర్నీ నవ్వనివ్వదు. అంతే కాదు. పిల్లికి బిచ్చం పెట్టని పిసినారి అని ఆవిడకి పేరు. అలాంటిది ఎంతో ఖర్చుపెట్టి కలిగిన ఫలితాన్ని చూసి మనసారా నవ్విందంటే ఏమనుకోవాలి! ఇంతకీ ఆ నవ్వుకి మూలాధారం మేమే అయి ఉండడం అదెంత ఆశ్చర్యకరం!

నర్సమ్మ నడిపే కరుణా కాన్వెంట్‌కి అటు నేనూ, ఇటు మా హరిప్రసాదూ అద్దెకున్నాం. ఫ్రెండ్సయిన మాకు క్లాస్‌మేట్స్ భార్యలుగా రావడం, నలుగురం కలిసి అప్పుడప్పుడు సాయంకాలం వేళ వాళ్ళ డాబా మీద ఎంజాయ్ చెయ్యడం మేమెప్పుడూ ఎదురు చూసే రిలీఫు.

హరిప్రసాద్ భార్య లీలావతి మొక్కలు పెంచడంలో ఎక్స్‌పర్టు. పేరుకి డాబా అన్నాను గాని అక్కడ ముఖ్యఆకర్షణ అంతా లీలావతి అమర్చిన పూల పందిరే!నిండా పువ్వులు పూసిన ఆ తీగె పేరేమిటోగాని దాని మూలం ఇవతలి వాళ్లింటి క్రింది రాతి గోడలోనే. ఎంతగా కృషి చేస్తే, ఎంత టైము రోజూ ఖర్చు పెడితే అంతటి సుగంధమూ అందమూ వెదజల్లే పందిరి తయారౌతుందో! ఇక అక్కడ చేరితే ఎక్కడెక్కడి చికాకులూ మర్చిపోయేవాళ్లం. ఇక మా కబుర్లంటారా? చీప్‌గా ఉండవుగాని సీరియస్ టాపిక్స్ వైపు మళ్లించం. పోచికోలు కబుర్లంటారు చూడండి, సుమారు ఆ లెవెల్లో ఉంటాయి. తేలికగా తీసుకుని బిగ్గరగా నవ్వడం అలవాటు చేసుకున్న వాళ్లం. ఓసారి అలాగే ఓ జోకు మైకంలో పడి నవ్వుకుంటూ ఉంటే పందిరి రాటలు ఊగిపోయి పూలన్నీ జలజలా రాలిపోతాయా అన్నంత పెద్ద చప్పుడయింది, మేం గుర్తించకుండానే. డాబా మెట్లెక్కి ఓ శాల్తీ పై కొచ్చిందని కూడా గుర్తించలేదు. సగం ఖగం, సగం మృగంలా ఉన్న ఆ ఆడమొగం నర్సమ్మదిట! మేం కూచోమన్నా ఆవిడ కూచోలేదు. "సారీ ..... మీలా కూచుని జల్సా చెయ్యడానికి నాకు టైం ఉండదు. మా పిల్లలకిప్పుడు స్టడీ అవర్సు. మీరిలా డిస్టర్బ్ చెయ్యడం తగదు. మీకూ మాకూ రాతిగోడే అడ్డు. మళ్లీ నా చేత యిలా చెప్పించుకోకండి". ఆ మొహం, ఆ చెప్పిన తీరూ గొప్ప నవ్వు కలిగించినా మర్యాద కోసం ఎలాగో తొక్కిపెట్టి ఆవిడా యిలా మెట్లు దిగగానే నలుగురం గొల్లుమన్నాం. మా ఇళ్ళ మధ్య స్కూలొకటుందని ఎరక్కపోలేదు గాని, అలా ఆవిడ ఒకటి రెండు సార్లు హెచ్చరించి వెళ్లేక సహజంగానే మా మనసులు ఆవిడ పనితీరుని ఆరా తీశాయి. మా రాంబాబు ద్వారా ఎన్నో విషయాలు తెలిశాయి.

ఇంతకీ కొత్తగా తెలిసేదేమిటి, ఏ ఒకటి రెండు మినహాయింపులో తప్ప ఏ కాన్వెంటయినా కసుగాయల పట్ల కఠిన కారాగార శిక్షే. పిల్లలంటే ఎవరు, విడుస్తున్న లేచివుళ్ళు. ఎగురుతున్న ఉడత కూనలు. ఆ ఊసులూ ఆ బోసినవ్వులూ చూడాలంటే సమస్త మానవాళీ క్యూ కట్టవలసిందే. అలాంటి సొగసులకా ముసుగులు? క్రష్ అయినా కాన్వెంటయినా మధురబాల్యానికి మందుపాతరే కదా! ఎవర్ని

నిందించి ఏం లాభం, మన ఆధునిక సంస్కృతిలోనే ఆ అపశ్రుతి వినిపిస్తోంది. తండ్రులు మందుబాబులూ తల్లులు మేకప్ దాసులూ అయినంత కాలం ఎవరి సంపాదన వారికి తప్పదు. పెద్దల్తో పడక వేరింటి కాపరాలు వెలగబెడుతున్న యువజంటలకి ఇప్పుడు వాళ్ల కడుపున పుట్టిన పిల్లల్తో సహా వేరు పడవలసి వస్తోంది. చంక దింపకూడని కుర్రకుంకల్ని సహా రెండు బొట్లేరు ముక్కల కోసం వేలు తగలేసి కాన్వెంట్స్‌లో కుదేస్తున్నారు. అమ్మకే అమ్మభాష రాదు గనుక 'తెలుగమ్మల తెగ' అనేది ఎప్పుడో ఆంధ్రప్రదేశ్‌లో మటుమాయమయింది.

ఇక నర్సమ్మ విషయానికే వస్తే డిసిప్లిన్ పేరిట ఆవిడ పిల్లల్ని పెట్టే హింస గొడ్రాళ్లనయినా గొల్లు మనిపిస్తుందిట. కాళ్ళూ చేతులే కాదు పిల్లల కళ్ళు కూడా అటూ ఇటూ తిప్పనివ్వదుట. ఆవిడ చెప్పినట్లు చెప్పిన పద్ధతిలో ఏ అక్షరమైనా పలకవలసిందే గాని లేపోతే ఆ పసిప్రాణి చెవో బుగ్గో తొడో ఏది దొరికితే అది ఎర్రబడిపోవలసిందేనట. ఏ హింసైనా కిక్కురుమనకుండా దిగమింగవలసిందే గాని కనుగుడ్లు చెమర్చినా శిక్ష రెట్టింపు అవుతుందిట. కతకడానికి మరో దారిలేక అక్కడ మా రాంబాబు పని చేస్తున్నాడు గాని స్టాఫు వీపు సాపు చెయ్యడానికి సహా నర్సమ్మ వెనుకంజవెయ్యదట!

ఇలాంటివి చెవినపడ్డ కొద్దీ పక్కింటి పంతులమ్మ మీద మాకు అసహ్యం పెరిగిపోయింది. అతి సమీపంలో జరిగే అక్రమాన్ని మేమెలా అరికట్టగలమనే ఆలోచన మా ఆహ్లాద వాతావరణాన్ని దెబ్బతీస్తోంది. పబ్లిక్కి ఏమైనా స్పందన ఉందా అంటే అదీలేదు! ఆయాల ద్వారా అన్నీ వింటున్నా అదే కాన్వెంటులో తమ పిల్లల సీట్లకోసం నోట్ల కట్టలు చేత్తో పట్టుకుని పేరెంట్సు క్యూలు కడుతున్నారంటే ఏమనుకోవాలి! అర్థమున్నా లేక పోయినా మా నవ్వుల సందడి స్థాయి రోజురోజుకీ పెంచడంలో మా వ్యతిరేకత ప్రదర్శిస్తున్నాం. 'మళ్లీ మళ్లీ చెబుతున్నాను. మీకిది మర్యాద కాదు. ఇది పిల్లలు చదువుకొనే టైము. మీరిలా గొడవ పెట్టడం నేను భరించలేను. చూస్తూ ఊరుకోను. ఇదే ఆఖరి హెచ్చరిక' అంటూ నర్సమ్మ వార్నింగ్ యిచ్చి వెడుతూంటే బల్లలు బాదేశాం, 'నీ దిక్కున్న చోట చెప్పుకో' అనే ధోరణిలో. వెళ్లే ముందు ఆవిడ మా పూల తీగె కాండాన్నీ నిండా పూసిన పువ్వుల్నీ ఎగాదిగా చూస్తూంటే అదెందుకో అనుకున్నాం.

హాస్టలు సదుపాయం కల్పించే విద్యా సంస్థలు సాధారణంగా సెలవులు ప్రకటించవు. పిల్లలు గుమ్మం దాటితే మరో స్కూల్లో చేరిపోతారేమో అని ఆ వ్యాపార చతురుల భయం. హాస్టల్ కమ్ స్కూల్ నిర్వహించే నర్సమ్మ ఆ మర్నాడు స్కూల్ పిల్లలకి సెలవు ప్రకటించడం ప్రపంచంలోనే ఎనిమిదో వింత. అయితే అది మామీద కసితీర్చుకోడానికని కలలో కూడా ఊహించలేకపోయాం. ఇంతకీ ఏం జరిగిందో తెలుసా? మా లీలావతీ వాళ్ల పందిరి పువ్వులన్నీ ఒక్క రోజులో మాడిపోయాయి. అంత పొడవుగావున్న ఆ పచ్చని తీగె ప్రాణం లేనట్టు వేళ్లాడిపోయింది. పసిబిడ్డకీ, పాలకుండకీ, పచ్చని చెట్టుకీ కలిపి చిల్లంగి పెడతారని వింటూంటాం. కొంపతీసి ఆ నర్సమ్మ ఇలాంటి ప్రయోగమేమీ చేయించలేదు కదా!

ఇది ఆవిడ పనే అని మా రాంబాబు ద్వారానే తెలిసింది.

లీలావతీ వాళ్ల పువ్వుల తీగె తల్లివేరు రాతిగోడలోంచి నర్సమ్మ వాళ్ల వైపు వెళ్లి అక్కడి స్థిరపడిందిట. తెలిసిన ఎగ్రికల్చరల్ ఎక్స్‌పర్ట్‌కి పెద్ద లంచం ఎరచూసి ఆ ఆదిమూలానికో పవర్‌ఫుల్ పాయిజనస్ ఇంజక్షను ఇప్పించిందిట! అలా నిలువెల్లా మాడిపోయిన పచ్చని పూల తీగెను చూసి నర్సమ్మ జీవితంలో మొట్టమొదటిసారి అన్నట్టు విరగబడి నవ్విందిట. పిల్లలందర్నీ పిలిపించి చప్పట్లు కొట్టించిందిట. ఆ శబ్దానికి పక్కనున్న లీలావతి డాబా బీటలు వేసేటంత పెద్దశబ్దంతో.

ఆ తర్వాతి రోజుల్లో కూడా బోసిపోయిన ఆ పందిరి కింద దిగాలు పడిన మొగాలతో మా నలుగురం కూడబలుక్కోకపోలేదు. నర్సమ్మ మీద ఏ కేసో పెట్టించి పగ తీర్చుకోవాలని అనిపించినా, చేతకాని పని ఎప్పుడూ కానిపని మాత్రమే అవుతుందని తెలుసుకున్నాం. వ్యక్తి మీద దెబ్బతీయడం కంటె వ్యవస్థని మార్చే ప్రయత్నం ముఖ్యమని బోధ పరుచుకున్నాం.

ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎలక్షన్లలో మాకు తెలిపిన ఓ వ్యక్తి డిపాజిట్ కూడా కోల్పోయాడని విని ఎంతో నవ్వుకోవడం గుర్తొచ్చింది. వాడికేదో తీరని నష్టం జరిగితే దేనికోసం మేం నవ్వినట్టు? ఇంతెందుకు, ఎవరైనా జర్రున జారి పడితే పక్కున నవ్వుతాం. అదేం అన్యాయం? అన్యాయమే. దాని పేరే శాడిజమ్. అతిశక్తిమంతమైన మానవ బలహీనత అది. నర్సమ్మ చేసిన పనికి ఆవిణ్ణి ఏ కేసులోనో ఇరికిస్తే మాడిన మా పూల పందిరి మళ్లీ చిగురిస్తుందా!

మా నవ్వులకి కారణం పైన విరబూసి కనిపించే పువ్వులూ అదీ కాకపోతే అంతకంటె పైన ఆకాశంలో మిలమిలమెరిసే చుక్కలూ - అంతేనా అంతవరకేనా, మేం లోలోపలికి చూసుకుని చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించుకుని అంతకంటె విలువైన నవ్వుల్ని నవ్వలేమా! కేవలం తాత్కాలికమైన హాస్యంతో కొట్టుకుపోడానికేనా మనిషి ఉన్నది! సంఘానికి ఆరోగ్యకరమైన స్ట్రోక్ ఇవ్వడానికే కదా అసలైన జోక్ పుట్టింది!

ఊరికే మాలో మేం మురిసిపోకపోతే బాల్యాన్ని దోచుకునే విద్యాలయాల పని పట్టించే ఉద్యమాలలోకి దిగితే అప్పుడు కలిగే ఆనందమూ తృప్తీ, దానివల్ల వచ్చే నవ్వూ హాస్యానికి అసలైన నిర్వచనంగా నిలబడతాయేమో!

★